గురువారం 09-01-2025

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 548 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD



మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com


షేక్ హసీనా

## వీసా గడువు పొడిగింపు

● కీలక నిర్ణయం తీసుకున్న భారత్



2 లో

ఆమ్ ఆద్మీ పార్టీకి

## తృణమూల్ మద్దతు

'థాంక్యూ దీదీ' అంటూ కేజ్రీవాల్ పోస్టు

3 లో



తెలంగాణలో

## బీర్ల సరఫరా నిలిపివేత

● నిలిచిపోనున్న ఏడురకాల బీర్లు

● నష్టాలు వస్తున్నాయని యూబీఎల్ నిర్ణయం



3 లో

కేటీఆర్ వెంట

## న్యాయవాదికి అనుమతి

విచారణ ఆడియో, వీడియో రికార్డు నిరాకరణ

తెలంగాణ హైకోర్టు ఆదేశాలు

2 లో



చంద్రబాబు లక్ష్యాలకు

## అండగా ఉంటాం

● రూ.2.08 లక్షల కోట్ల ప్రాజెక్టులకు శంఖుస్థాపన

● వైజాగ్ పర్యటనలో ప్రధాని మోడీ

2 లో



మే 1 నుంచి కొత్త ఉద్యోగాలకు

## నోటిఫికేషన్లు

● ప్రభుత్వాన్ని ఖాళీల వివరాలు అడిగాం

● టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రావెంకటేశం



ముందడుగు తెలంగాణ


మే 1 నుంచి కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని టీజీపీఎస్సీ వెల్లడించింది. మార్చి 31లోగా ఉద్యోగ ఖాళీల వివరాలను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు పేర్కొంది. ఖాళీల ప్రకారం నోటిఫికేషన్ల జారీపై ఏప్రిల్‌లో కసరత్తు చేస్తామని తెలిపింది. కొత్త నోటిఫికేషన్లు ఇచ్చి 6-8 నెలల్లో భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని కమిషన్ ప్రకటించింది. గురువారం గ్రూప్-3 'కీ' విడుదల చేశారు. రెండ్రోజుల్లో గ్రూప్-2 'కీ' విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ఫలితాలు వచ్చేలా పనిచేస్తున్నామని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. ఈనెల 11, 12 తేదీల్లో బెంగళూరులో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల సదస్సు ఉంటుందని, ఉద్యోగ పరీక్షల విధానాలపై సదస్సులో చర్చించనున్నట్లు చెప్పారు.

రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టులలో

## స్క్రీనింగ్..

హెచ్ఎంపీవీ వైరస్‌పై కేంద్రం అప్రమత్తత

2 లో



ముందడుగు
గురువారం
09-01-2025
హైదరాబాద్

## రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టులలో

# స్క్రీనింగ్..

**ముందడుగు జాతీయం**

దేశంలో రోజురోజుకు హెచ్ఎంపీవీ కేసులు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు వైరస్ ఏడుగురికి పాజిటివ్‌గా తేలింది. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాల వద్ద పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసింది. దేశంలో హెచ్ఎంపీవీ ఇన్ఫెక్షన్ పెరుగుదల నేపథ్యంలో సివిల్ సర్జన్లందరికీ ఒక సలహా జారీ చేసినట్లు హర్యానా ఆరోగ్య మంత్రి ఆర్తీ సింగ్‌రావు తెలిపారు. హర్యానాలో ఇప్పటివరకు ఒక్క హెచ్ఎంపీవీ కేసు రికార్డవలేదని.. అయితే, ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు.

హెచ్ఎంపీవీ ముప్పు నేపథ్యంలో ప్రభుత్వాలు నిఘాను పెంచాయి. రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలతో పాటు రద్దీగా ఉండే ప్రాంతాల్లో స్క్రీన్ చేస్తున్నారు. దగ్గు, జలుబుతో ఆసుపత్రులకు వచ్చే రోగులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. వాటిని స్క్రీన్ చేయడంతో పాటు పలు రాష్ట్రాల్లో రోగులను ఉంచేందుకు ఐసోలేషన్ వార్డులను సైతం సిద్ధం చేస్తున్నారు. హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ శ్వాసకోశ వ్యవస్థలో సమస్యలను కలిగిస్తుంది. రోగనిరోధక వ్యవస్థ బలంగా లేని వ్యక్తులకు ప్రమాదకరం. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల్లో ఎక్కువగా వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉంది.

# కేటీఆర్ వెంట న్యాయవాదికి అనుమతి

**ముందడుగు తెలంగాణ**

మాజీ మంత్రి కేటీఆర్ వెంట ఏసీబీ విచారణకు న్యాయవాదిని తీసుకెళ్లేందుకు తెలంగాణ హైకోర్టు అనుమతించింది. విచారణ ఆడియో, వీడియో రికార్డు చేసేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఏసీబీ విచారణకు వెళ్లే సమయంలో తన వెంట న్యాయవాదిని అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టింది. విచారణకు వెళ్లే సమయంలో న్యాయవాదిని అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కేటీఆర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

న్యాయవాది రామచంద్రరావు కేటీఆర్ వెంట విచారణకు హాజరవుతారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కేటీఆర్ విచారణను ఆడియో, వీడియో రికార్డు చేయాలని న్యాయవాది కోరగా.. అందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. న్యాయవాది లైబ్రరీలో కూర్చుంటే కేటీఆర్ విచారణ కనిపిస్తుందని ఈ సందర్భంగా ఏఏజీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. న్యాయవాదితో కలిసి గురువారం ఏసీబీ విచారణకు వెళ్లాలని న్యాయస్థానం కేటీఆర్‌కు సూచించింది. గురువారం విచారణ తర్వాత ఏవైనా అనుమానాలుంటే మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని హైకోర్టు తెలిపింది.

# షేక్ హసీనా వీసా గడువు పొడిగింపు

**ముందడుగు జాతీయం**

భారత్‌లో ఆశ్రయం పొందుతోన్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పై స్వదేశంలో ఎన్నో ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఆమెను తమకు అప్పగించాలని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం ఇప్పటికే న్యూఢిల్లీకి సందేశం పంపింది. తాజాగా ఆమె పాస్‌పోర్టును రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పరిణామాల వేళ భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆమె వీసా గడువును పొడిగించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. హసీనా మరికొంత కాలం భారత్‌లో ఉండేందుకు వీలుగా ఆమె వీసా గడువును కేంద్రం పొడిగించినట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. స్థానిక ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ద్వారా వచ్చిన అభ్యర్థనను కేంద్రం పరిశీలించిన అనంతరం పొడిగింపుపై నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇదే సమయంలో హసీనాకు శరణార్థిగా ఆశ్రయం కల్పించనున్నారంటూ వస్తున్న వార్తలను సదరు వర్గాలు కొట్టిపారేశాయి. షేక్ హసీనా వీసా గడువు పొడిగింపు

## చంద్రబాబు లక్ష్యాలకు

# అండగా ఉంటాం

**ముందడుగు ఆంధ్రప్రదేశ్**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసుకున్న లక్ష్యాలకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భరోసా ఇచ్చారు. ఏపీలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా విశాఖ ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆశయాల సాధనకు మద్దతుగా నిలుస్తామని మోదీ హామీ ఇచ్చారు. "ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు. మీ ఆశీర్వాదంతో 60 ఏళ్ల తర్వాత తొలిసారి మేం మూడోసారి అధికారంలోకి వచ్చాం. రాష్ట్రానికి అన్ని రంగాల్లో మద్దతుగా నిలుస్తున్నాం. 2047 నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ రాష్ట్రంతో భుజం భుజం కలిపి నడుస్తాం అన్నారు.

ముందడుగు
గురువారం 09-01-2025 హైదరాబాద్

## జడ్జీలకు జీతాలు ఇవ్వడానికి

# డబ్బులు ఉండవా..!

### ఉచితాల పేరుతో పంచడానికి మాత్రం ఉంటాయా

### రాష్ట్రాల తీరుపై సుప్రీంకోర్టు ఆక్షేపణ



ముందడుగు జాతీయం

ఉచితాల పేరుతో పంచడానికి రాష్ట్ర ప్రభుత్వాల దగ్గర డబ్బులుంటాయిగానీ.. జిల్లా న్యాయ వ్యవస్థల్లోని జడ్జీలకు జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డువస్తాయని సుప్రీంకోర్టు ఆక్షేపించింది.

ఎన్నికలు రాగానే.. లాడ్లీ బెహెన్‌తోపాటు ఇతర పథకాలను ప్రకటించి కచ్చితమైన సొమ్మును పంచుతారు. ఢిల్లీలో ఇప్పుడు ఒక పార్టీ రూ.2,500 ఇస్తామంటే మరోపార్టీ మరింత ఇస్తామంటుంది' అని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం వ్యాఖ్యానించింది. పదవీ విరమణ చేసిన జడ్జీలకు పెన్షన్లపై 2015లో అఖిల భారత న్యాయమూర్తుల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. న్యాయాధికారుల జీతాలు, పదవీ విరమణ ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం.. ఆర్థిక పరిమితులను పరిగణనలోకి తీసుకుంటుందని ఈ సందర్భంగా అటార్నీ జనరల్ వెంకటరమణి కోర్టుకు తెలిపారు. దీంతో ధర్మాసనం తీవ్రంగా స్పందించింది.

## ఆమ్ ఆద్మీ పార్టీకి

# తృణమూల్ మద్దతు

ముందడుగు ఢిల్లీ

దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తోన్న ఆమ్ ఆద్మీ పార్టీకి తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. ఫిబ్రవరి 5న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మద్దతు ప్రకటించినట్లు ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'థాంక్యూ దీదీ' అంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌నకు తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. మమత దీదీకి వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా. థాంక్యూ దీదీ. మా మంచి చెడుల్లో మీరు ఎల్లప్పుడూ అండగా నిలిచారు" అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. తాజా పరిణామంతో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌నకు మద్దతుగా నిలిచిన 'ఇండియా' కూటమి మిత్రపక్షాల జాబితాలో తాజాగా ఆప్ చేరడం గమనార్హం.

## తెలంగాణలో

# బీర్ల సరఫరా నిలిపివేత

ముందడుగు తెలంగాణ

తెలంగాణ రాష్ట్రంలో ఏడు రకాల బీర్ల సరఫరా నిలిచిపోనుంది. ఐదేళ్లుగా ధరలు పెంచకపోవడంతో భారీగా నష్టాలు వస్తున్నాయని పేర్కొంటూ యూనైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యూబీఎల్) ఈమేరకు నిర్ణయం తీసుకుంది. యూబీఎల్ ప్రతినిధులు బుధవారం ఎక్సైజ్‌శాఖ కమిషనర్‌ను కలిసి.. తెలంగాణకు పూర్తిగా బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్టు లేఖ అందజేశారు. ధరలు పెంచాలని పలు మార్లు కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని, దీంతో తమకు భారీగా నష్టాలు వస్తున్నాయని లేఖలో పేర్కొన్నారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు.

## ప్రతి కుటుంబానికి

# రూ.25లక్షల ఆరోగ్యబీమా

### ఢిల్లీ వాసులకు కాంగ్రెస్ హామీల వర్షం




ముందడుగు ఢిల్లీ

కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ వాసులకు హామీల వర్షం కురిపిస్తోంది. తాజాగా 'జీవన్ రక్ష యోజన' అనే పథకాన్ని కాంగ్రెస్ ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.25లక్షల ఆరోగ్యబీమా కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గహ్లోత్ బుధవారం ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. రాజస్థాన్‌లో తాము అధికారంలో ఉన్నప్పుడు ఇదే పథకాన్ని అమలుచేశామని గుర్తుచేశారు. ఎలాంటి షరతులు, పరిమితులు లేకుండా దీన్ని అమలు చేసినట్లు తెలిపారు. ఢిల్లీకి ఈ పథకం ఓ గేమ్‌ఛేంజర్ అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే 'ప్యారీ దీదీ యోజన' పథకం కింద ప్రతి మహిళకు ప్రతి నెలా రూ.2,500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇదిలాఉండగా.. దేశ రాజధాని ఢిల్లీలో జరిగే ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. మొత్తం 70 శాసనసభ స్థానాలకు ఫిబ్రవరి 5న ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడనున్నాయి.

ముందడుగు
గురువారం 09-01-2025 హైదరాబాద్

# మహిళల శరీరంపై కామెంట్ చేసినా వేధింపే

## కేరళ హైకోర్టు వ్యాఖ్యలు

ముందడుగు కేరళ

మహిళల శరీరంపై ఏలాంటి వ్యాఖ్యలు చేసినా, అది లైంగిక వేధింపు అవుతుందని కేరళ హైకోర్టు పేర్కొన్నది. జస్టిస్ ఏ బదరుద్దీన్ ఈ తీర్పును ఇచ్చారు. కేరళ విద్యుత్తు శాఖకు చెందిన ఓ మహిళా ఉద్యోగినిపై మరో ఉద్యోగి కామెంట్ చేశారు. దీంతో ఆమె లైంగిక వేధింపుల కేసు నమోదు చేసింది. ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆ ఉద్యోగి కోర్టును ఆశ్రయించాడు. 2013 నుంచి ఆ ఉద్యోగి చాలా అసభ్యకరమైన భాషను వాడారని, 2017లో అభ్యంతరకరమైన మెసేజ్‌లు, వాయిస్ కాల్స్ చేసేవాడని ఆమె ఆరోపించింది. విద్యుత్తు శాఖకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.

మహిళా ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఐపీసీలోని సెక్షన్ 354ఏ(లైంగిక వేధింపులు), 509(మహిళను కించపరచడం), సెక్షన్120 (ఓ) కింద కేసు బుక్ చేశారు. కేరళ పోలీసు చట్టంలోని సెక్షన్ 120(ఓ) కింద కూడా ఆ ఉద్యోగి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కోర్టు పేర్కొన్నది.



అయితే కేవలం శరీర సౌష్టవం బాగుందని కామెంట్ చేసినంత మాత్రానా.. తనపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారని, ఆకేసును కొట్టివేయాలని విద్యుత్తు శాఖ ఉద్యోగి కోర్టును ఆశ్రయించారు. కాల్స్, మెసేజ్‌లతో నిందిత వ్యక్తి లైంగిక వేధింపుల కామెంట్స్ చేసినట్లు మహిళా ఉద్యోగి ఆరోపించింది. అయితే ఐపీసీలోని సెక్షన్ 354ఏ, 509తో పాటు సెక్షన్ 120 కేరళ పోలీసు చట్టం ప్రకారం నిందితుడిపై తగిన ఆధారాలు ఉన్నట్లు హైకోర్టు తెలిపింది.



# ప్రశ్నించే విధానంతోనే మెరుగైన సమాజం

## ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్

ముందడుగు హైదరాబాద్

అవినీతి లేని సమాజాన్ని నిర్మించేందుకు యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ కృషి చేయాలని సంస్థ సలహదారులు, ప్రముఖ సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్ అన్నారు. గురువారం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవినీతి రహిత సమాజం కోసం యువత ముందుకు రావాలని, మెరుగైన సమాజం కోసం కృషి చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచి, పట్టణ స్థాయి వరకు అవినీతి నిర్మూలనపై అవగాహన కల్పించాలన్నారు. ప్రశ్నించే విధానంతోనే మెరుగైన సమాజం ఏర్పడుతోందని అన్నారు. సమాజంలో మార్పు కోసం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ చేస్తున్న వినూత్న కార్యక్రమాలు ఆలోచింపజేసే విధంగా ఉన్నాయన్నారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ రాజేంద్ర పల్నాటి, సలహదారులు అశోక్ కుమార్, మహిళా బృందం డా. స్రవంతి, డా. స్నిగ్ధ, గీతారెడ్డి, హైదరాబాద్ అధ్యక్షుడు కొన్నె దేవేందర్, కోర్ కమిటీ సభ్యులు కొమటి రమేశ్ బాబు, ధ్యేవనపల్లి రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎనర్జీ-ఎఫిషియెంట్ వాటర్ హీటర్ అందిస్తున్న బజాజ్

హైదరాబాద్




బజాజ్ మీ జేబుకు భారం కాకుండా, హాయిగా వెచ్చదనాన్ని అందించేందుకు తయారు చేసిన ఎనర్జీ-ఎఫిషియెంట్, సమర్థవంతమైన వాటర్ హీటర్ల శ్రేణిని మీకు అందిస్తుంది. జాగ్రత్తతో రూపొందించబడిన, బజాజ్ వాటర్ హీటర్లు స్థిరమైన సౌకర్యాన్ని అందిస్తాయి. అదే సమయంలో మీకు విద్యుత్తును ఆదా చేయడంలో సహాయపడతాయి. ఇది ఏజ్‌గార్డ్™ సాంకేతికత బాహ్య శరీరం రంగు క్షీణతను నిరోధిస్తుంది. దీనికి 4-సంవత్సరాల ఉత్పత్తి వారంటీ మరియు 6 సంవత్సరాల మూలకం వారంటీ మద్దతు ఉంది. మన్నికైన లక్షణాలతో పాటు, ఇది 8 స్మార్ట్ మోడ్‌లను కలిగి ఉంది. ఇది వినియోగదారులు వారి అవసరానికి అనుగుణంగా గీజర్‌ను సెట్ చేసుకునేందుకు అనుమతిస్తుంది. పెంటకిల్ డిజి అనేది స్మార్ట్ వాటర్ హీటర్. ఇది పొదుపు మరియు శాశ్వత పనితీరును అందిస్తుంది. ఇది 15లీ మరియు 25లీ 2 కెపాసిటీ ఎంపికలలో అందుబాటులో ఉంది. ధర రూ.19,210/- నుంచి ప్రారంభమవుతుంది.

# తెలంగాణ జైళ్లు దేశానికే ఆదర్శం

- ఖైదీలు, సిబ్బంది భద్రతకే మొదటి ప్రాధాన్యం..
- జైళ్లను ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు కృషి..
- త్వరలోనే రాష్ట్రంలో ఉన్న జైళ్లను మరమ్మత్తులు..
- అన్యూల్ మీట్ లో జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా..

ముందడుగు హైదరాబాద్




తెలంగాణ జైళ్లు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని జైల్ శాఖ డీజీ సౌమ్య మిశ్రా అన్నారు. జైళ్ల వార్షిక నివేదిక విడుదల సందర్భంగా వారు మాట్లాడారు. చివరిసారిగా 2019 లో అన్యూల్ మీట్ ఏర్పాటు చేశామని.. 2024 లో జైల్ అదాలత్ లో 1045 లో అవకాశం కల్పించామని అన్నారు. 2650 మంది ఖైదీలు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో ట్రెనింగ్ తీసుకుంటున్నారని.. సత్ప్రవర్తన కలిగిన 213 మంది ఖైదీలను విడుదల చేసినట్లు తెలిపారు. 2024 లో 8 మంది ఖైదీలకు బ్యాంక్ లోన్స్ ఇచ్చామని.. జైల్లో ఉండి 750 మంది డిగ్రీ పూర్తి చేశారని, 225 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ పట్ట పొందారని అన్నారు.

జైల్లో ఉన్న ఖైదీల ద్వారా ఇంటికి అవసరమైన పరికరాలను ఖైదీలతో తయారు చేయించామని.. ఖైదీల నుండి టైలరింగ్, ప్రింటింగ్ ప్రెస్ బేకరి యూనిటి, పౌల్ట్రీ వంటి పరిశ్రమలు ఏర్పాటు చేశామని అన్నారు. జైల్లో ఉన్న ఖైదీలకు ఉపాధి కల్పనకు అవసరమైన జాతీయ చమురు కంపెనీలతో 29 అవుట్ లే అవుట్ లెట్లను ఏర్పాటు చేశామని అన్నారు. నుమయిష్ ఎగ్జిబిషన్ లో మా స్టాల్ ఏర్పాటు చేశామని.. గతంలో నుమయిష్ ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన స్టాల్ కి తెలంగాణ ప్రభుత్వం అవార్డు ఇచ్చిందని తెలిపారు. జైళ్లను ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని, త్వరలోనే రాష్ట్రంలో ఉన్న జైళ్లను మరమ్మత్తులు చేయడానికి ప్రభుత్వం సన్నద్ధం అవుతుందని సౌమ్య మిశ్రా తెలిపారు. అల్లు అర్జున్ విడుదల సమయంలో వెనుక గేట్ నుండి పంపడంపై కూడా పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ అంశంపై క్లారిటీ ఇచ్చారు. అల్లు అర్జున్‌ను జైలు వెనుక గేటు నుండి పంపడంలో తమ నుండి ఎలాంటి తప్పు లేదని సౌమ్య మిశ్రా స్పష్టం చేశారు.